# 'నివురు కప్పిన నిప్పులు'

మన దైనందిన జీవితంలో కొందరు సాదాసీదాగా కనిపించే వ్యక్తుల్లో మనకు కనిపించని కళలు దాగి ఉంటాయి.

దాగుంటాయి అనడం కంటే కొన్ని పరిస్థితులు వాటిని కప్పేస్తాయి అనడం సబబు.

మళ్లీ కొన్ని పరిస్థితులు అనడం కంటే ఆర్థిక పరిస్థితులు అనడమే సబబు.

ఎందుకూ?...ఏమిటీ?.. అన్నేను ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు.

డబ్బు... మనీ... రుపయ్యా... పణం... దుడ్డు...

వాళ్లల్లో దాగివున్న కళలు అకస్మాత్తుగా బయటపడ్డప్పుడు మనం అచ్చెరువొంది...

'అయ్యా! మహానుభావా! నీలో ఈ కళదాగుందా? ఇంతోటి కళను బొజ్జలో దాచుకొని ఎలా ఉండగలిగావయ్యా?" అని ప్రశ్నిస్తాం. లేదూ మనకి మనం ప్రశ్న వేసుకుంటాం.

* * *

నాకు, మూస రచయితలకు భిన్నంగా వున్నాడన్న పేరు కొద్దికొద్దిగా వస్తున్న రోజుల్లో తెలుగు పాఠకుల్నించీ భిన్నప్రాంతాల్నించీ ఉత్తరాలొస్తుండేవి... (వస్తున్నాయి) అందులో ఓ ఉత్తరం బాగా గుర్తుంది.

అది డిఫెన్స్ ఉత్తరం. మిలట్రీ వాళ్లది.

ఎక్కడో చైనా బార్డర్నించీ వచ్చిన ఉత్తరం.

ఉత్తరం రాసిన వ్యక్తి పేరు శివాజీ. ఆయనే ఏదో అంకెలు సంకేతంగా యిచ్చారు. మిలట్రీ సెన్సారు అదీ అయ్యి వచ్చిన ఉత్తరం.

ఓ మాసపత్రిక అనుబంధ నవలగా వచ్చిన నా రచన చదివి అభినందిస్తూ రాసిన ఉత్తరమది.

నా నవల ప్రచురితమైన నాలుగు నెల్లకు వచ్చిందా ఉత్తరం. అనుబంధ నవలగా నా రచనను చూసుకున్నాను గానీ, ఆ పత్రికలో వచ్చిన యితర రచనల్ని చూడలేదు నేను (అహంకారమంటారా? అనవచ్చునేమో?)

సదరు ఉత్తర రచయిత నా రచనని ప్రశంసిస్తూ రాసి చివర్న ఆ పత్రికలో తన కథ కూడా ఉందనీ సదరు పత్రికవాళ్లు పంపిన కాంప్లి మెంటరీ కాపీ నాలుగు నెల్లకి తనకు చేరిందనీ... అందువలన ఆలస్యంగా ఉత్తరం రాస్తున్నాననీ తెలిపారు. అంటే ఆ నాలుగు నెల్ల కాలం ఆ మంచి రచయితని నేను గుర్తించలేదు.

నేను మామూలు పాఠకుడనుకున్న వ్యక్తి ఓ మంచి రచయితని ఆలస్యంగా గ్రహించినందుకు నన్ను నేను తిట్టుకుంటున్నాను.

అదుగో అలాగే నాకు మామూలు పాఠకుడిగా పరిచయమైన వ్యక్తి ఓ అద్భుత చిత్రకారుడని చాలా ఆలస్యంగా గ్రహించాను.

పాఠకుడిగా ఓ నాలుగేళ్ల క్రితం పరిచయమయ్యారు శ్రీ ఎర్రమిల్లి రోహిణీకుమార్. పరిచయమైన సమయానికి ఓ పెద్ద అడ్వర్టైజ్‌మెంట్ సంస్థకి మానేజింగ్ డైరెక్టరుగా పరిచయమయ్యారు.

'No artist has art written on his face' అన్నట్టు కళాకారుడి మొహమ్మీద కళ రాసి వుండదు కదా!

వ్యక్తిగత స్నేహం బలపడ్డ, ఓ శుభావసరాన ఆయన నన్ను వాళ్లింటికి భోజనానికి ఆహ్వానించారు.

వెళ్లాను...

అందమైన ఇల్లు...

బుద్ధిమంతులైన... సంతానం...

అనుకూలవతి అయిన సహచరి...

ఆవిడ వండి ఆప్యాయంగా వడ్డించిన భోజనం...

తర్వాత ఇల్లు కలియజూశాను (వాసాలు లేని ఇల్లే లెండి)

గోడలకి ఓ రెండు అద్భుతమైన చిత్రాలు వేలాడ్తున్నాయి.

'ఎవరివండీ అవి' అని అడిగా

"నేనే వేసా" అని యధాలాపంగా ఆయన...

"అంటే మీరూ...?" అన్నేను ఆశ్చర్యపోడం...

తర్వాత తీరిగ్గా చెప్పారాయన... తండ్రిగారితో పోరాడి ఎదిరించి ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ చేసి కమర్షియల్ ఆర్టిస్ట్‌గా స్థిరపడాలనుకుని... చివరాఖరికి అడ్వర్టైజ్‌మెంట్ రంగంలో మిగిలారట. డబ్బు ఎంత పనైనా చేస్తుంది కదండీ... వ్యాపారంలో ధక్కా మొక్కీలు తిని ఊపిరి సలుపుకునే సమయమొచ్చేసరికి... కుంచెలూ క్యాన్వాసులూ ఆటకెక్కాయిట...

"మరి కళ మాటేమిటి?" అనడిగానాయన్ని.

"వేస్తా వేస్తా... దానికీ ప్రోగ్రాం పెట్టా... ఇంకొద్ది సంపాదించేసి, పిల్లలకి ఢోకాలేదనుకున్నప్పుడు ఎక్కడో దూరంగా పెద్ద తోటలో చిన్న ఇల్లు కట్టుకుని వానప్రస్థం స్వీకరించి మళ్లీ కుంచె పడతా" అన్నారు రోహిణీకుమార్.

చూడండి మళ్లీ అక్కడా లక్ష్మీదేవిదే పైచేయి.

పెద్దతోట చిన్న ఇల్లు... వీటికీ డబ్బు కావల్సిందే కదా రోహిణిగారూ? ఇలాంటి వాళ్లలోని సుప్త కళలు మనకు ఎదురైనప్పుడు ఆనందంకన్నా ఖేదం ఎక్కువ కలుగుతుంది... వాళ్లల్లో మరుగునపడిపోయిన కళను తలచుకుని, కాదంటారా?

* * *

అన్నట్టుగానే రోహిణీ కుమార్ అనకాపల్లి వెళ్ళి అక్కడ కొద్దిగా భూమికొని, తోట పెంచుకుని, చిన్న ఇల్లు కుట్టకుని... హైదరాబాదులో వ్యాపారాలు అమ్మేసి వెళ్ళిపోయి అనకాపల్లెలో పూర్తిస్థాయి చిత్రకారులుగా శేష జీవితాన్ని గడుపుతోన్నారు. ●